క్లుప్తంగా

కమలమ్మకు సాదర స్వాగతం



కమలమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ విచ్చేసిన పీసీసీ ఉపాధ్యక్షురాలు, భెల్ ఎంప్లాయీస్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రేడ్ యూనియన్ (బీఈఆర్‌పీటీయూ) గౌరవ అధ్యక్షురాలు పి.కమలమ్మకు బీఈఆర్‌పీటీయూ నాయకులు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. అరకు గిరిజన ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆమెను సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్, బీఈఆర్‌పీటీయూ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సంస్థలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను వివరించారు.

12 నుంచి ఏఐటీయూసీ జిల్లా మహాసభలు



మహాసభలు పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ తదితరులు

పెదగంట్యాడ: విశాఖ నగరంలో ఈ నెల 12 నుంచి రెండురోజుల పాటు నిర్వహించనున్న ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవనంలో మంగళవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పల్లేటి పోలయ్య, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పెద్దాడ రాజు

పెదగంట్యాడ: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పెద్దాడ రాజు సూచించారు. పెదగంట్యాడ జంక్షన్‌లో వాహనచోదకులకు మంగళవారం ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది హెల్మెట్ ధరించకపోవడంతోనే మృతి చెందుతున్నారన్నారు. గతేడాది హెల్మెట్ ధరించకపోవడంతో 152 మంది మృత్యువాత పడ్డారని తెలిపారు. హెల్మెట్ ధరిస్తే ప్రమాద సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

గాజువాక: ఉపాధి అవకాశాలు గల కోర్సుల్లో ఉచిత శిక్షణకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు కార్యదర్శి రామ్మూర్తి తెలిపారు. టెక్ మహీంద్ర సహకారంతో నిర్వహించనున్న ఈ శిక్షణకు డిగ్రీ ఉత్తీర్ణులై 18 నుంచి 29 ఏళ్ల వయసు గల నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. టైపింగ్ స్కిల్స్, ఎం.ఎస్.ఆఫీస్, ఇంటర్నెట్, బేసిక్ నెట్ వర్కింగ్ కాన్సెప్ట్, స్పోకెన్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, ఎక్స్‌ఎంఎల్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, ఐటీఈఎస్/బీపీవో, సీఆర్ఎస్, బీఎఫ్ఎస్ఐ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ తదితర కోర్సులలో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం అర్హులకు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తామని తెలియజేశారు. వివరాల కోసం పంతులు గారి మేడ వద్ద గల టెక్ మహీంద్ర స్మార్ట్ సెంటర్‌లో గాని లేదా 79976 42164, 63099 56383 నంబర్లలో గాని సంప్రదించాలని సూచించారు.

'భవిత'కు భరోసా



చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు



బొమ్మలు తయారు చేస్తున్న చిన్నారులు



చిన్నారులకు ఫిజియో థెరపీ

- ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమానికి ప్రాధాన్యం
- 'నిరామయ'తో ఆరోగ్య రక్ష
- చిన్నారుల తల్లిదండ్రుల హర్షం

పెదగంట్యాడ: ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఇందులో భాగంగా మండల తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న భవిత కేంద్రంలో చిన్నారులకు ప్రత్యేక వసతులు కల్పించింది. నెల్లిముక్కులోని కేంద్రంలో 14 ఏళ్లలోపు వయసు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలు 20 మంది ఉన్నారు. కంటిచూపు, వినికిడి లోపం, మాటలు రాని, చలనస్థితి లేకుండా, పక్షవాతం, మానసిక వైకల్యం గల చిన్నారులకు ఈ కేంద్రం వరంగా మారింది. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో వీరికి అవసరమైన సేవలను అందిస్తున్నారు.

ఆటపాటలతో విద్యా బోధన

పిల్లలకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పించేలా కేంద్రంలో శిక్షణ పొందిన ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్లు (ఐఈఆర్టీలు) కృషి చేస్తున్నారు. ఫిజియో థెరపిస్ట్, సైకాలజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్‌తో ప్రత్యేకావసరాలు గల పిల్లల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందిస్తూ మార్పులు తీసుకువస్తున్నారు. అవసరమైన వారికి ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు అందజేస్తున్నారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.10వేలు విలువైన ఆట వస్తువులను అందజేశారు.

'నిరామయ'తో ఆరోగ్య భద్రత

ప్రత్యేక అవసరాల గల పిల్లల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నిరామయ ఆరోగ్య భద్రతా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించేందుకు గుర్తింపు కార్డులను అందజేస్తున్నారు. అలాగే వైద్య పరీక్షలు, ఆపరేషన్లు, అవయవమార్పిడి వంటివి చేయించుకునే వెసులుబాటు కల్పించారు.

ప్రతిభకు ప్రోత్సాహం

ఈ చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఐఈఆర్టీలు కృషి చేస్తున్నారు. వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా వారితో చిన్న చిన్న బొమ్మలు తయారు చేయిస్తున్నారు. వారికి ప్రత్యేకంగా విద్యాబోధన చేస్తున్నారు.

సేవలు బాగున్నాయి



వినికిడి లోపం, బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న పిల్లలకు ఈ కేంద్రంలో మంచి సేవలు అందుతున్నాయి. నా కుమార్తె చరిష్మా బుద్ధిమాంద్యంతో బాధపడుతోంది. నాలుగేళ్ల నుంచి ఈ కేంద్రానికి పంపిస్తున్నాను. ఇక్కడ సేవలు, బోధన బాగున్నాయి.

–నీలాపు ప్రవీణ, విద్యార్థిని తల్లి

పురోగతి కనిపిస్తోంది



నా కుమారుడు హర్షవర్ధన్ పుట్టుకతోనే వినికిడి లోపంతో బాధపడుతున్నాడు. ఎవరు ఏం చెప్పినా అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నాడు. రెండేళ్ల నుంచి ఈ కేంద్రానికి తీసుకువస్తున్నాను. ఇప్పుడు ఏం చెప్పినా అర్థం చేసుకుంటున్నాడు. కొంచెంకొంచెం ఆరోగ్యం మెరుగుపడుతోంది. చాలా సంతోషంగా ఉన్నాను.

– నీల్లా భవాని, విద్యార్థి తల్లి, సీతానగరం ఎస్సీ కాలనీ

లోకం తెలియని పసిపిల్లలు



ఈ కేంద్రంలోని పిల్లలకు లోకం తెలియదు. అటువంటి వారికి అనుగుణంగా పాఠాలు బోధిస్తున్నాం. వారిలోని ప్రతిభను ప్రోత్సహిస్తున్నాం. మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. దీంతో తల్లిదండ్రులు కూడా సంతృప్తిగా ఉన్నారు.

– ఎం.సూర్యనారాయణ, ఐఈఆర్టీ

అర్థమయ్యేలా బోధిస్తున్నాం



భవిత కేంద్రానికి వచ్చే చిన్నారులకు అర్థమయ్యేలా, ఆటపాటలతో విద్యాబోధన సాగిస్తున్నాం. ఇష్టమైన, పోషక విలువలున్న ఆహారాన్ని అందిస్తున్నాం. చిన్నారుల్లో పురోగతి కనిపించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోజూ క్రమం తప్పకుండా పిల్లలను కేంద్రానికి తీసుకువస్తున్నారు.

–బి.జయభారతి, ఐఈఆర్టీ

ఉక్కు కార్మికుల వేతనాలపై కేంద్ర మంత్రికి వినతి



కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు సెయిల్ వలే వేతన ఒప్పందం అమలు చేయాలని స్టీల్‌ప్లాంట్ ట్రేడ్ యూనియన్ జాయింట్ ఫోరం నాయకులు కేంద్ర ఉక్కుమంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కోరారు. శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో నాయకులు మంగళవారం న్యూఢిల్లీలో మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి వ్యక్తిగతంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. అనంతరం విశాఖ ఎంపీ ఎం.వి.వి. సత్యనారాయణతో మాజీ ఉక్కు మంత్రి నరేంద్ర తోమర్‌ను కలిసి వేతన ఒప్పందం అమలుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, జె.ముత్యాలు, వరసాల శ్రీనివాస్, డి.వి. రమణారెడ్డి, కె. సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న ఏసీపీ త్రినాథ్, నిర్వాహకులు

గాజువాక: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ కోరారు. స్థానిక సీఎల్‌సీ ఆధ్వర్యంలో సమకూర్చిన కుట్టు మిషన్లను పేద మహిళలకు ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడటానికి కుట్టుమిషన్లు దోహదం చేస్తాయన్నారు. 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు మాట్లాడుతూ పేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేసిన సీఎల్‌సీ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పప్పు రాజారావు, సీఎల్‌సీ నిర్వాహకులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు తమ నివాస ప్రాంతంలోనే ఓటు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఓటర్లకు తాము నివాసముంటున్న ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలోనే ఓటు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఓటరు జాబితాలపై ఇంటింటా నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా ఆయన రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్‌కు, ఆ ప్రాంతానికి కుదిరే పార్ట్ పేరును, సెక్షన్ పేరును సర్వే చేయించి వచ్చేవారం పార్టీలకు తెలియజేస్తామని తెలిపారు. దీని వల్ల అందరికీ తాము నివాసం ఉండే ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలోనే ఓటు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సహాయ ఓటర్ల నమోదు అధికారి, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు పాల్ కిరణ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ దొంగ అరెస్ట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ప్రైవేటు యార్డు నుంచి కాపర్ కేబుల్‌ను దొంగిలించిన వ్యక్తిని సీఐఎస్ఎఫ్ సిబ్బంది పట్టుకుని స్టీల్‌ప్లాంట్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ సమీప ప్రాంతంలో ఉంటున్న సూరాడ పోలయ్య మంగళవారం అప్పికొండ కాలువ నుంచి రహస్యంగా స్టీల్‌ప్లాంట్‌లోకి ప్రవేశించాడు. ప్లాంట్‌లోని బెల్ యార్డ్ నుంచి కాపర్ కేబుల్‌ను దొంగిలించి తరలిస్తుండగా అటువైపు గస్తీ కాస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. అతని నుంచి రూ. 6 వేలు విలువైన 25 మీటర్ల కాపర్ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



బీసీ గేటు వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయవద్దని కోరుతూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉదయం 9 గంటలకు పాత గాజువాక జంక్షన్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు వైటీ దాస్, నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద అఖిలపక్ష యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో కణితి అప్పలరాజు, బైరెడ్డి గురప్ప, నమ్మి సింహాద్రి, దొమ్మేటి అప్పారావు, నమ్మి రమణ, పాల అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్కలంగా ఉన్నా అంద'నీరు'

- అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా
- ఒక ప్రాంతానికి ప్రతి రోజు.. మరో ప్రాంతానికి రోజు విడిచి రోజు సరఫరా
- వివిధ ప్రాంతాల్లో ప్రజల అవస్థలు



10ఎంజీడీ వాటర్ ప్లాంట్‌లోని క్లారిఫ్లోక్యులేటర్

గాజువాక: పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ గాజువాక 10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టులో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఏ ప్రాంతానికి ఎప్పుడు నీరు ఇస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా పట్టించుకొనే నాథుడు లేకుండా పోయారు. ఒకే వార్డులో కొన్ని ప్రాంతాలకు ప్రతి రోజు నీరు ఇస్తుండగా, మరికొన్ని ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు ఇవ్వడం కూడా గగనమైపోయింది. ఈ విషయంపై అధికారులు ఒకరకంగా, సిబ్బంది మరోరకంగా స్పందించడం గమనార్హం.

వివరాలివి..

చినగంట్యాడ, స్నేహపురి కాలనీ, చైతన్యనగర్ ప్రాంతంలో రోజు విడిచి రోజు నీరు సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని ఆ ప్రాంతవాసులు ఎప్పటికప్పుడు అధికారులకు చెబుతున్నా పరిష్కారం కావడం లేదు. గడిచిన రెండు నెలుగా ఇదే పరిస్థితి ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం ఆరోపణలకు తావిస్తోంది. 10 ఎంజీడీ ప్లాంట్‌లో మోటార్లు పని చేయడం లేదని నీటి సరఫరా సిబ్బంది చెబుతున్నారు. ఈ కారణంగా ట్యాంకులు నిండటం లేదని, దీంతో ఒక ప్రాంతానికి ఒకరోజు, మరో ప్రాంతానికి మరో రోజు నీటిని సర్దుతున్నామని పేర్కొంటున్నారు. అయితే, ఈ విషయంపై అధికారులు మరో విధంగా స్పందిస్తున్నారు. మోటార్లు బాగానే పని చేస్తున్నాయని, గతంలో పని చేసిన అధికారులు ప్లాంట్ నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఫిల్టరేషన్ సరిగా జరగక నీటి సరఫరా ఆలస్యమవుతోందని చెబుతున్నారు.

గాజువాకలోని పది వార్డుల్లో నీటి సరఫరా కోసం గోదావరి 10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టును 2012లో ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు కోసం అప్పట్లో 16 పంపులను, 12 వాటర్ బెడ్‌లను నిర్మించారు. పంపులు మరమ్మతులకు గురై ఏళ్లు గడుస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఒక పంప్‌నకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తెచ్చేసరికి మరో పంప్ పాడవుతోందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో గాజువాకలోని వివిధ ప్రాంతాల వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.

కొండవాలు కాలనీల్లో సౌకర్యాలకు ప్రాధాన్యం



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: గాజువాకలోని కొండవాలు ప్రాంత కాలనీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 70వ వార్డులోని ఎర్రగెడ్డ కాలనీలో రూ.16 లక్షల వ్యయంతో మల్టీపర్పస్ హాల్, ఎల్‌బీఎస్ నగర్ కొండవాలు ప్రాంతంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, మెట్లు, కల్వర్టుల నిర్మాణం, చిట్టినాయుడు కాలనీలో రూ.18 లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణాల కోసం మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు విస్తృతంగా సాగుతున్నాయన్నారు. గాజువాకలో ఇప్పటికే ప్రధాన సమస్యలను పరిష్కరించగలిగామని, మిగిలిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి చందు, స్థానిక నాయకులు పాలఘాట్ కృష్ణ, అచ్చిబాబు, కొణతాల రాము, బాబులునాయుడు, భూషణం, రాపేటి గోవింద్, పల్లా రమణ, చట్టి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు కార్మిక సంఘాల నివాళి



స్టీల్‌ప్లాంట్‌లో గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ప్రజా గాయకుడు గద్దర్‌కు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నివాళి అర్పించారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి. దాస్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిదన్నారు. పోరాట కమిటీ కన్వీనర్ కె.ఎ స్.ఎన్. రావు మాట్లాడుతూ ఏ ఉద్యమంలోనైనా ప్రజలను మమేకం చేసి తద్వారా పోరాటాలను నిర్వహిస్తే ఆ పోరాటం విజయవంతం అవుతుందని గద్దర్ నిరూపించారన్నారు. జీవిత కాలం ప్రజా చైతన్యం కోసం గద్దర్ కృషి చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఓబీసీ సంఘం నాయకులు బి. అప్పారావు మాట్లాడుతూ గద్దర్ తన పాట, ఆటతో ప్రజలను చైతన్యపరిచి, ఉద్యమాలకు ఊపిరి అందించారన్నారు. నాయకులు జి.గణపతిరెడ్డి, సురేష్‌బాబు, కె. పరంధామయ్య, రామకృష్ణ, కామేశ్వరరావు, మహలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు బలి



908వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం కుటిల రాజకీయంతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనివల్ల అమాయకులైన కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 908వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపవలసిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందని, వారి ఆటలు సాగవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చెత్త తొలగించి.. ముగ్గులు వేసి..

కళకళలాడిన ఆలయ ప్రాంగణం



ఆలయ ప్రాంగణంలో చెత్త తొలగించి, ముగ్గులు వేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు వినాయకనగర్ వుడా కాలనీలోని పద్మావతి ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం రంగవల్లికలతో కళకళలాడింది. ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ సిబ్బందితో ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాల్లో చెత్తను తొలగింపజేసి, శుభ్రం చేయించారు. అనంతరం ప్రాంగణంలో రంగు రంగుల ముగ్గులు వేయించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసి పరిసరాలను అపరిశుభ్రం చేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

మేయర్ దృష్టికి 77వ వార్డు సమస్యలు



మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: తమ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి నగర మేయర్ హరివెంకట కుమారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. తమ వార్డు నగరానికి దూరంగా ఉండటంతో, ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

అధ్యాపకులతోనే సామాజిక మార్పు



శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: సమాజంలో మంచి మార్పులు తీసుకువచ్చే శక్తి అధ్యాపకులకు ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక అభివృద్ధికి దోహదకారిగా అధ్యాపకులు నిలవాలన్నారు. వైవిధ్యమైన జ్ఞానాన్ని కళాశాలలో విద్యార్థులకు అందించే ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థిలోని లోపాలను ఎత్తి చూపకుండా, వారిని సరిదిద్ది తగిన మార్గదర్శకం అందించేలా ఉండాలని సూచించారు. భారత్ విశ్వగురువుగా ఆవిర్భవించాలని ప్రధాని మోదీ ఆశిస్తున్నారని, ఈ దిశగా యువతను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సమాజంతో అనుసంధానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న 21 మంది అధ్యాపకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

కాలానుగుణంగా నైపుణ్యాల పెంపు అవసరం

ఏయూ క్యాంపస్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ డీసీఎంఎస్ విభాగంలో మేక్ యువర్ సెల్ఫ్ కార్పొరేట్ రెడీ అంశంపై నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుస్తక జ్ఞానంతో పాటు, సాఫ్ట్‌స్కిల్స్, వ్యక్తిత్వం, వ్యవహార శైలి వంటివి ఉద్యోగ సాధనలో ఎంతో కీలకమన్నారు. రూబికస్ సంస్థ ప్రతినిధులు అమర్ నాగేంద్ర, పల్లవి, కోమలి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం అతిథులను విభాగం తరఫున సత్కరించారు.